# వెండితెరను ఏలండి



**నేటితరం** నటుల ఫోకస్ అంతా సోషల్ మీడియా పైనే ఉందనీ.. దాన్ని వదిలేసి వెండితెరను ఏలాలని పిలుపునిస్తున్నది సీనియర్ నటి అమీషా పటేల్. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. సోషల్ మీడియా, బాలీవుడ్ యాక్టర్స్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తమ తరానికి, ప్రస్తుత తారలకూ మధ్య ఉన్న తేడాలను చెప్పుకొచ్చింది. ''మేము సినిమాలు చేస్తున్నప్పుడు సోషల్ మీడియా కన్నా.. వెండితెరపై ప్రదర్శనలకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చేవాళ్లం. కానీ, ఇప్పటివాళ్లు కళపై దృష్టి పెట్టడం కన్నా.. సోషల్ మీడియాలోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఆన్‌లైన్‌లో తమ ఇమేజ్‌ను కాపాడుకోవడంలోనే ఎక్కువగా నిమగ్నం అవుతున్నారు'' అంటూ విమర్శించింది. ఇంకా.. ''నేటితరం వారి ఇన్‌స్టాగ్రామ్ పోస్టుల గురించే ఎక్కువ ఆందోళన చెందుతున్నారు. షూటింగ్ మధ్యలో రీల్స్ చేయడం, వారి మేకప్ వ్యాన్లో ఏం జరుగుతున్నదో.. వారి మేకప్ ఆర్టిస్ట్, స్టయిలిస్ట్ ఎలా పనిచేస్తారో చూపించడంపైనే ఎక్కువ దృష్టిపెడుతున్నారు. అందుకే, బాక్సాఫీస్ వద్ద బోల్తా కొడుతున్నారు. ఎప్పుడూ రీల్స్‌లో కనిపించే ఇలాంటి నటుల కోసం టిక్కెట్లు కొనడానికి ప్రేక్షకులు కూడా ఆసక్తి చూపడంలేదు. అందుకే, కొత్త నటులు బాక్సాఫీస్ వద్ద పెద్దగా కలెక్షన్లు సాధించడం లేదు!'' అంటూ విమర్శలు గుప్పించింది. తమకాలంలో షారుఖ్ ఖాన్, సల్మాన్ ఖాన్, అక్షయ్ కుమార్ వంటి సీనియర్ నటులు.. ప్రేక్షకులను థియేటర్లకు రప్పించడంలో విజయవంతం అయ్యారని చెప్పుకొచ్చింది. తనతో పాటు ప్రీతీజింటా, రాణీ ముఖర్జీ, కరీనా కపూర్ లాంటి నటులంతా.. పార్టీలూ, ఈవెంట్లలో కనిపించడానికి ప్రాధాన్యం ఇవ్వలేదనీ, కాబట్టే ప్రజలు ఇప్పటికీ వారిని చూడాలని కోరుకుంటున్నారనీ అంటున్నది. ''అమితాబ్, ధర్మేంద్ర వంటి సూపర్‌స్టార్ల జమానాలో.. ఇలాంటి టీవీ చానెళ్లు, ఇంటర్వ్యూలు కూడా లేవు. అయినప్పటికీ ప్రేక్షకులు వారిపై పిచ్చి అభిమానంతో ఉండేవారు. వారి సినిమాలు వెండితెరపైకి వచ్చినప్పుడు.. రికార్డులను తిరగరాశాయి. సోషల్ మీడియా అనేది ఒక సాధనం మాత్రమే.. అదే జీవితం కాదన్న సత్యాన్ని నేటితరం గుర్తించాలి'' అని హితబోధ చేసింది.

## భర్తే ఊసరవెల్లి



**తన భర్త,** బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్‌ను ఊసరవెల్లితో పోల్చింది సీనియర్ నటి కత్రినా కైఫ్. ఊసరవెల్లి రంగులు మార్చినంత సులువుగా.. విక్కీ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయగలడని ప్రశంసల వర్షం కురిపించింది. విక్కీ కౌశల్, రష్మిక మందన్నా ప్రధాన పాత్రల్లో నటించిన 'ఛావా'.. ఈ శుక్రవారం విడుదలైంది. తాజాగా సినిమాను వీక్షించిన కత్రినా.. ఇన్‌స్టా వేదికగా ప్రత్యేక రివ్యూ ఇచ్చింది. ఇదొక అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్.. శంభాజీ మహరాజ్ గొప్పతనాన్ని గొప్పగా చూపించారంటూ కితాబునిచ్చింది. 'నాకు ఏం మాట్లాడాలో తెలియడం లేదు. చివరి 40 నిమిషాలైతే ప్రేక్షకులు నోరెళ్లబెట్టి చూస్తారు. సినిమాను మళ్లీ మళ్లీ చూడాలని అనుకుంటారు!' అంటూ రాసుకొచ్చింది. ఇక ఈ చిత్రంలో విక్కీ నటన గురించి ప్రస్తావిస్తూ.. అతణ్ని సరదాగా ఊసరవెల్లితో పోల్చింది. 'ఈ సినిమా నాపై చూపిన ప్రభావం మాటల్లో చెప్పలేనిది. విక్కీ.. చాలా అద్భుతంగా చేశావు. నువ్వు తెరపై కనిపించిన ప్రతిసారీ, ప్రతి షాట్ కూడా అద్భుతం! నిన్నూ, నీ ప్రతిభను చూసి నేను చాలా గర్వపడుతున్నాను' అంటూ పోస్ట్ చేసింది. 'ఛావా' పేరుతో శివాజీ సావంత్ రాసిన మరాఠీ నవల ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. ఇందులో శివాజీ మహరాజ్ తనయుడు శంభాజీ మహరాజ్‌గా విక్కీ కౌశల్ నటించగా, శంభాజీ భార్య యేసుబాయిగా రష్మిక మందన్నా కనిపించింది. ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ సినిమా.. మొదటి రోజే 47 కోట్ల కలెక్షన్లు సాధించి, హిట్ టాక్‌తో దూసుకెళ్తున్నది.






సంక్రాంతి తర్వాత సినిమా సీజన్ అంటే సమ్మరే. పిల్లల పరీక్షలు పూర్తయిపోవడం.. దానికి తోడు ఎండకాలం సెలవులు. రెండు నెలలూ పిల్లలు ఇంట్లోనే ఉంటారు. ఇక వినోదమంటే తొలి ప్రయారిటీ సినిమానేగా!? కుటుంబాలకు కుటుంబాలు థియేటర్లకు క్యూ కట్టేది అందుకే. ఈ సీజన్‌లో సినిమా కాస్త బాగుంటే చాలు నిర్మాతలకు కాసుల పంటే. ఎప్పటిలాగే ఈ ఏడాది కూడా సమ్మర్ సినిమాల సందడి భారీగానే ఉంది. సీనియర్ స్టార్లు, జూనియర్ స్టార్లు.. వీళ్లతోపాటు పక్కనే ఉన్న తమిళ హీరోలు అందరూ ఈ ఎండకాలాన్నే టార్గెట్ చేశారు. ఆ సమ్మర్ సందడేంటో.. దాని కథాకమామీషు ఏంటో కాస్త తెలుసుకుందాం..

# సమ్మర్‌కు సిద్ధమవ్వండి

**సీ**నియర్ స్టార్లయిన బాలకృష్ణ, వెంకటేశ్.. సంక్రాంతిని టార్గెట్ చేసి భారీ విజయాలను అందుకున్నారు. ముఖ్యంగా వెంకీ అయితే.. 'సంక్రాంతికి వస్తున్నాం'తో రీజనల్ సినిమా రికార్డులన్నిటినీ బద్దలు చేసి సంక్రాంతి వీరుడయ్యాడు. పొంగల్ తర్వాత సినిమావారికి ఇష్టమైనది వేసవి. ఈ టైమ్‌లో విడుదలైన సినిమాలు మంచి కలెక్షన్లు సాధిస్తాయని వారి నమ్మకం. అందుకు తగ్గట్టుగా పలు సినిమాలు వేసవి వార్‌కు సిద్ధమవుతున్నాయి.

**రానున్న** ఎండకాలంలో థియేటర్లలో సందడి చేసే స్టార్ల గురించి చెప్పాలంటే ముందు అగ్రనటుడు చిరంజీవి నుంచి మొదలుపెట్టాలి. ప్రస్తుతం ఆయన వశిష్ట దర్శకత్వంలో 'విశ్వంభర' సినిమా చేస్తున్నారు. యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ సినిమాలో త్రిష కథానాయిక. ఇంకా కొంతమంది హీరోయిన్లు కీలకపాత్రల్లో నటిస్తున్నారు. 'జగదేకవీరుడు–అతిలోకసుందరి', 'అంజి' సినిమాల తర్వాత చిరంజీవి నటిస్తున్న సోషియో ఫాంటసీ సినిమా ఇది. 'విశ్వంభర' అనే లోకం చుట్టూ ఈ కథ నడుస్తుందని తెలుస్తున్నది. ఇందులో చిరంజీవి కారణజన్ముడిగా కనిపిస్తారట. మే 9న సినిమా విడుదల చేయనున్నట్టు వినికిడి. నిజానికి మే 9 చిరంజీవికి కలిసొచ్చిన డేట్. ఆయన నటించిన 'జగదేకవీరుడు అతిలోకసుందరి', 'గ్యాంగ్‌లీడర్' సినిమాలు విడుదలైందీ ఆ తేదీనాడే కావడం గమనార్హం.



> తమిళ హీరోలు సైతం సమ్మర్‌నే టార్గెట్ చేశారు. రజినీకాంత్ 'కూలీ' ఈ సమ్మర్‌లోనే మే1న విడుదల కానున్నదట. అలాగే, ఏప్రిల్ 11న 'భారతీయుడు 3', జూన్ 5న మణిరత్నం 'థగ్‌లైఫ్' సినిమాలతో కమల్‌హాసన్ హంగామా చేయనున్నట్టు సమాచారం. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో అజిత్‌కుమార్ నటించిన 'గుడ్ బ్యాడ్ అగ్లీ' సినిమా కూడా ఏప్రిల్ 10న సందడి చేయనుంది. కార్తిక్ సుబ్బరాజు దర్శకత్వంలో సూర్య నటించిన 'రెట్రో' మే 1న విడుదల కానుంది.

**వేసవిలో** కాస్కో అంటున్న రెండో సీనియర్ హీరో అక్కినేని నాగార్జున. ఆయన నటించిన రెండు సినిమాలు ఈ సమ్మర్‌లో విడుదల కానుండటం విశేషం. ఈ రెండూ తమిళ చిత్రాలే కావడం మరో విశేషం. పైగా రెండిటిలోనూ ఆయన హీరోగా కాకుండా, ప్రత్యేక పాత్రల్లో కనిపిస్తుండటం గమ్మత్తు! వాటిలో మొదటిది 'కుబేర'. ధనుష్ కథానాయకుడిగా రూపొందుతున్న ఈ చిత్రానికి శేఖర్ కమ్ముల దర్శకుడు. తన బాణీకి భిన్నంగా శేఖర్‌కమ్ముల తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఆడియన్స్‌లో అంచనాలు భారీగా ఉన్నాయి. ఇందులో నాగార్జున కరోడ్‌పతిగా కనిపిస్తారని తెలుస్తున్నది. ఈ సినిమా కథా వివరాలు బయటికి పొక్కకుండా జాగ్రత్త పడుతున్నారు శేఖర్ కమ్ముల టీమ్. రష్మిక కథానాయిక. ఏప్రిల్ 30న సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు నిర్మాతలు సునీల్ నారంగ్, రామ్‌మోహన్‌రావు పుస్కూర్. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ హీరోగా వస్తున్న 'కూలీ' సినిమాలో నాగార్జున విలన్‌గా నటిస్తున్నట్టు కోలీవుడ్ న్యూస్. తలైవాను ఢీకొనే పాత్రలో నాగ్ కనిపిస్తే ఇక థియేటర్లలో జాతరే కదా! కళానిధి మారన్ నిర్మిస్తున్న ఈ చిత్రం మే 1న విడుదల కానున్నదని సమాచారం. అంటే.. రెండ్రోజుల తేడాతో ఈ రెండు సినిమాలు విడుదల అవుతుండటం విశేషం.

**మరో** అగ్రహీరో పవన్‌కళ్యాణ్ 'హరి హరవీరమల్లు' ఫ్రాంచైజీలో తొలి భాగం ఈ సమ్మర్‌లోనే విడుదల కానుంది. ఈ చిత్రంలో కొంతభాగానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించగా, మిగతాదంతా ఏఎం జ్యోతికృష్ణ తెరకెక్కిస్తున్నారు. పవన్‌కళ్యాణ్ నటిస్తున్న తొలి జానపద చిత్రం ఇదే కావడం విశేషం. ఇందులో ఆయన రాబిన్‌హుడ్ తరహా పాత్రలో కనిపిస్తారు. మొగల్ సామ్రాజ్య నేపథ్యంలో కోహినూర్ డైమండ్ చుట్టూ తిరిగే కథతో దర్శకుడు జ్యోతికృష్ణ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. నిధి అగర్వాల్ ఇందులో కథానాయిక. మార్చి 28న విడుదల అవుతున్న ఈ సినిమాతో సమ్మర్ సీజన్ మొదలుకానుంది.



**ఇక** పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటిస్తున్న 'ద రాజాసాబ్' కూడా సమ్మర్‌లోనే రానుంది. హారర్ కామెడీ మూవీగా రూపొందుతున్న ఈ చిత్రంలో సూపర్‌స్టార్‌డమ్ ఉన్న ప్రభాస్ నటిస్తుండటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని, ఆయనే 'రాజాసాబ్' అనే ఘోస్ట్‌గా కనిపిస్తారని తెలుస్తున్నది. సంజయ్‌దత్ కీలక పాత్రధారి. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ కథానాయికలు. ఏప్రిల్ 10న సినిమా విడుదల కానుంది.



**'ధమాకా'(2022)తో** వందకోట్ల విజయాన్ని సాధించిన రవితేజ.. అదే కసితో ఇప్పుడు 'మాస్ జాతర' చేస్తున్నారు. శ్రీలీల కథానాయిక. రచయిత భాను భోగవరపు దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. రవితేజ గత చిత్రాల మాదిరిగానే మాస్ నేపథ్యంలో ఈ సినిమా సాగుతుందని తెలుస్తున్నది. మే 9న ఈ సినిమా విడుదల చేయాలని ముందు భావించారు. కానీ అదేరోజు 'విశ్వంభర' రానుంది. స్వతహాగా చిరంజీవి వీరాభిమాని అయిన రవితేజ.. మరి అభిమాన హీరో కోసం ఆ డేట్‌ను త్యాగం చేస్తారో లేదో చూడాలి. ఒకవేళ డేట్ మార్చుకున్నా.. రిలీజైతే సమ్మర్‌లోనే.

**ఇక** ఈ వేసవి రానున్న మరో స్టార్ హీరో నాని. 'హిట్' ఫ్రాంచైజీలో మూడో సినిమా అయిన 'హిట్ 3'లో ఆయన హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. హిట్, హిట్ 2 మంచి విజయాలు సాధించిన నేపథ్యంలో 'హిట్ 3'పై భారీ అంచనాలే ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొనే దర్శకుడు శైలేష్ కొలను ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. 'హిట్' కథానాయకుడు విశ్వక్‌సేన్, 'హిట్2' కథానాయకుడు అడివి శేషు ఇందులో ప్రత్యేక పాత్రల్లో కనిపించనున్నట్టు సమాచారం. నిధి శెట్టి కథానాయిక. మే 1న సినిమా విడుదల కానుంది.

**టాలీవుడ్** క్రేజీ హీరోల్లో ఒకరైన విజయ్ దేవరకొండ కూడా సమ్మర్‌లో సందడి చేయనున్నారు. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఆయన నటించిన 'కింగ్‌డమ్' చిత్రం ఈ సమ్మర్‌లోనే విడుదల కానుంది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో వచ్చిన మళ్లీరావా, జెర్సీ చిత్రాలు అద్భుతంగా ఆడాయి. ఆయన దర్శకత్వంలో విజయ్ దేవరకొండ సినిమా అనగానే అంచనాలు తారాస్థాయికి చేరుకున్నాయి. భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో హీరో సత్యదేవ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. మే 30న 'కింగ్‌డమ్' విడుదల కానుంది.

**సమ్మర్‌లో** సందడి చేయనున్న మరో స్టార్ హీరో సిద్ధు జొన్నలగడ్డ. ఆయన 'జాక్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. బొమ్మరిల్లు భాస్కర్ దర్శకుడు. వైష్ణవి చైతన్య కథానాయిక. 'టిల్లు స్క్వేర్'తో వందకోట్ల విజయాన్ని సాధించిన సిద్ధు జొన్నలగడ్డ నుంచి వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఏప్రిల్ 10న సినిమా విడుదల కానుంది. ఇంకా సందీప్‌కిషన్ 'మజాకా', నితిన్ 'రాబిన్‌హుడ్', శర్వానంద్ 'నారి నారి నడుమ మురారి', అనుష్క ప్రధాన పాత్రలో క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన 'ఘాటీ'.. ఈ సినిమాలన్నీ సమ్మర్ రిలీజ్‌లే. ఆ విధంగా ఈ సమ్మర్ అంతా భారీ సినిమాలతో థియేటర్లు కళకళలాడనున్నాయి. ఇక సినీ అభిమానులకు కావాల్సినంత టైమ్‌పాస్.

... సినిమా డెస్క్

# పల్లెలో నగరవాసి!

## సివరపల్లి

ఓటీటీ మాట

**అమెజాన్ ప్రైమ్ :** జనవరి 24, 2025
**తారాగణం :** రాగ్ మయూర్, మురళీధర్ గౌడ్, రూపలక్ష్మి, పావని కరణం, సన్నీ పల్లె తదితరులు
**దర్శకుడు :** భాస్కర్ మౌర్య

**ఓటీటీల** రాకతో తెరపై భాషా భేదాలు తొలగిపోయాయి. అన్ని భాషల సినిమాలు, వెబ్ సిరీస్‌లు.. ఇతర భాషల్లోకి అనువాదం అవుతున్నాయి. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా.. అన్ని రాష్ర్టాల ప్రేక్షకులకూ చేరువవుతున్నాయి. వారివారి ఆదరాభిమానాలు పొందుతున్నాయి. అలా.. హిందీలో తెరకెక్కిన 'పంచాయత్' వెబ్ సిరీస్ కూడా దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన క్రేజ్ సంపాదించుకున్నది. దీనికి తెలుగు రీమేక్‌గా వచ్చిందే 'సివరపల్లి' సిరీస్! అయితే, స్టార్ హీరోల సినిమాలు, వెబ్ సిరీస్‌లు కూడా ఇతర భాషల్లోకి అనువాదం అవుతున్న ఈ సమయంలో.. రీమేక్ చేయడం అంటే సాహసమే! అంతటి సాహసం చేయాలంటే.. కథలో కొత్తదనం ఉండాలి. మరి, తెలుగు రీమేక్‌గా ప్రేక్షకుల ముందుకొచ్చిన 'సివరపల్లి'లో అంతటి కొత్తదనం ఏముందో తెలుసుకోవాలంటే.. కథలోకి వెళ్లాల్సిందే! హైదరాబాద్‌లో మొదలై.. కామారెడ్డి జిల్లాలోని 'సివరపల్లి' అనే పల్లెలో కొనసాగే కథ ఇది. బీటెక్ చదివిన శ్యామ్ (రాగ్ మయూర్).. తన స్నేహితుల మాదిరిగా ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాలని అనుకుంటాడు. అయితే, తండ్రి బలవంతంతో పంచాయతీ సెక్రటరీగా ఉద్యోగంలో చేరతాడు. కామారెడ్డి జిల్లాలో మారుమూల గ్రామమైన 'సివరపల్లి'లో పోస్టింగ్ తీసుకుంటాడు. మిత్రులంతా ఫారిన్‌లో సెటిల్ అవుతుంటే.. తాను ఈ పల్లెటూరికి రావడంతో ఇబ్బందిగా ఫీలవుతుంటాడు. ఇక సివరపల్లిలో మహిళా సర్పంచ్ సుశీల (రూపలక్ష్మి) ఇంటికే పరిమితం అవుతుంది. ఊరి పెత్తనమంతా.. ఆమె భర్త సుధాకర్ (మురళీధర్ గౌడ్)దే! ఉద్యోగంలో చేరిన శ్యామ్.. 'సివరపల్లి' పంచాయతీ ఆఫీసులోనే ఒక గదిలో ఉంటాడు. ఆ పల్లె వాతావరణం.. అక్కడి మనుషుల ప్రవర్తన శ్యామ్‌కు చిరాకు కలిగిస్తూ ఉంటుంది. తానుకూడా సాధ్యమైనంత త్వరగా ఫారిన్ వెళ్లడానికి అవసరమైన ఏర్పాట్లు చేసుకుంటూ ఉంటాడు. ఈ క్రమంలో సర్పంచ్ భర్త, పంచాయతీ ఆఫీస్ ఉద్యోగులతో శ్యామ్ ఎలాంటి కష్టాలను అనుభవిస్తాడు? అతనికి తన కూతురిని ఇచ్చి పెళ్లి చేద్దామనే ఆలోచన సర్పంచ్‌కు ఎందుకొస్తుంది? ఫారిన్ వెళ్లాలనే శ్యామ్ ప్రయత్నం ఫలిస్తుందా? అనేవి.. ఎనిమిది ఎపిసోడ్లుగా వచ్చిన ఈ సిరీస్‌లో ఆసక్తిని రేకెత్తించే అంశాలు.



# కలలు సాధించుకోవాలి..

**ప్రతి** ఒక్క ఆడపిల్లా.. తన కలలను సాధించుకోవాలని పిలుపునిస్తున్నది బాలీవుడ్ నటి, నిర్మాత రిచా చద్దా. కొవిడ్ సమయంలో తాను రాసిన కథ ఆధారంగా తెరకెక్కుతున్న చిత్రానికి 'ఆఖ్రీ సోమ్‌వార్' అనే టైటిల్ ఖరారైంది. ఈ సందర్భంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో రిచా మాట్లాడుతూ.. ఓ మధ్యతరగతి పంజాబీ కుటుంబంలో పెరిగిన తన సొంత అనుభవాల నుంచి ప్రేరణ పొంది ఈ కథ రాసుకున్నట్టు వెల్లడించింది. ''అమ్మాయిలు బాల్యం నుంచే ఎన్నో కలలు కంటూ ఉన్నత చదువులు చదువుతారు. అయితే, వివాహబంధంలోకి అడుగుపెట్టడంతోనే ఆ కలలన్నీ కల్లలే అవుతాయి. కుటుంబ పోషణకోసం ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టినా.. తమ కలలు మాత్రం నెరవేర్చుకోలేని స్థితిలో ఉంటారు. ఎందుకంటే.. అప్పటికి వారు 30 ఏళ్లు దాటి, పిల్లల పెంపకంలో తలమునకలై ఉంటారు'' అంటూ చెప్పుకొచ్చింది. తన సినిమా 'ఆఖ్రీ సోమ్‌వార్' కూడా ప్రేమలు, కలలు, సామాజిక అంశాలతో నిండి ఉంటుందని వెల్లడించింది. కాగా, రిచా చద్దా.. 'ఓయ్ లక్కీ! లక్కీ ఓయ్!' చిత్రంలో ఓ చిన్న పాత్రతో చిత్రసీమలో అడుగుపెట్టింది. 2012లో వచ్చిన క్రైమ్ సినిమా.. గ్యాంగ్స్ ఆఫ్ వాసేపూర్‌తో మంచి గుర్తింపు తెచ్చుకున్నది. ఈ చిత్రంలో గ్యాంగ్‌స్టర్ భార్యగా ఆమె పోషించిన పాత్రకు.. ఉత్తమ నటిగా ఫిల్మ్‌ఫేర్ క్రిటిక్స్ అవార్డును కూడా అందుకున్నది. 2022లో మీర్జాపూర్ ఫేమ్ అలీ ఫజల్‌ని ప్రేమ వివాహం చేసుకున్నది. తాజాగా, చిత్ర నిర్మాణరంగంలోకీ అడుగుపెట్టింది. సంజయ్ లీలా భన్సాలీ.. 'హీరామండీ' వెబ్ సిరీస్‌లో మెప్పించిన రిచా.. 'అభీతో పార్టీ షురూ హుయీ హై' సినిమాలోనూ మెరిసింది.



# మహిళగా ఎదగాలి..

**''ఆడపిల్ల** అంటే.. మహిళగా పుట్టడం కాదు, మహిళగా ఎదగాలి!'' అని పిలుపునిస్తున్నది నటి, ఎంపీ కంగనా రనౌత్. చిన్నప్పుడు చదివిన ఈ కొటేషన్.. తన జీవితంలో ఇప్పుడు నిజమైందని అంటున్నది. ఇప్పటికే సినిమా, రాజకీయ రంగాల్లో రెండు పడవల ప్రయాణం చేస్తున్న కంగనా.. తాజాగా ఫుడ్ బిజినెస్‌లోకీ అడుగుపెట్టింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మనాలిలో ఇటీవలే కేఫ్‌ను ప్రారంభించింది. ఈ సందర్భంగా ఓ ఇంగ్లిష్ మీడియా సంస్థతో మాట్లాడుతూ.. తన బాల్య స్మృతులను గుర్తుచేసుకున్నది. ఆడపిల్లవనీ, ఇంటి పనులకే ఎక్కువ సమయం కేటాయించాలనీ వాళ్ల అమ్మ ఎప్పుడూ చెబుతుండేదట. పచ్చళ్లు పెట్టడం, నెయ్యి తయారు చేయడంతోపాటు కూరగాయలు పండించడం కూడా నేర్చుకోమని చెప్పేదట. ''ఆ సమయంలో అమ్మ చెప్పే మాటలు.. నాకు ఏమాత్రం నచ్చేవి కావు. అమ్మ ఏంటి? ఇంత తెలివితక్కువ మాటలు చెబుతుంది అనిపించేది'' అంటూ నాటి సంగతులను నెమరువేసుకున్నది కంగనా. ''బాల్యం నుంచే ఉన్నత ఆలోచనలతో ఉండేదాన్ని. దేశంలోనే అతిచిన్న వయసులో ధనవంతురాలైన మహిళల్లో నేను కూడా ఒకదాన్ని అనుకునేదాన్ని. ఇప్పుడు కూడా అదే చెబుతున్నా! ప్రతి మహిళా స్వశక్తితో పైకి రావాలని కోరుకుంటున్నా!'' అని చెప్పుకొచ్చింది. ''చిన్నప్పుడు అమ్మ చెప్పిన మాటలకు అసలైన అర్థం ఏంటో ఇప్పుడు అర్థమైంది. ఇప్పుడు నేను కేఫ్‌ను ప్రారంభించాను. నేను పరిణతి చెందానని, తెలివైనదాన్ని అయ్యానని మా అమ్మ భావిస్తుంది. ఈరోజు ఆమె ఎంతో సంతోషంగా ఉంది'' అంటూ ముగించింది.

